ప్రజాశక్తి
మంగళవారం 2 డిసెంబర్ 2025
5
విజయనగరం

5న భామినికి సిఎం రాక



ప్రజాశక్తి-భామిని

ఈ నెల ఐదో తేదిన పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు సిఎం చంద్రబాబునాయుడు రానున్నారు. భామిని మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ కార్యక్రమానికి సిఎం హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన వివరాలను సిఎం కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. సిఎం పర్యటన ఖరారు కావడంతో సమగ్ర శిక్ష రాష్ట్ర అధికారులు బి.శ్రీనివాసరావు, దేవానంద్, జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఆదర్శ పాఠశాలను సందర్శించారు.

భోగాపురంలో వరి చేలలో చేరిన నీరు

కోతకు గురైన ముక్కాం సముద్ర తీరం

తుపానుతో రైతుల్లో గుబులు

- వర్షాలతో తడిచిన వరిచేలు
- తీరంలో అలజడి

ప్రజాశక్తి -భోగాపురం, వంగర, పూసపాటిరేగ

బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుపాను కారణంగా జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి చిన్నపాటి వర్షాలు కురవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లా అంతటా ముమ్మరంగా వరి కోతలు అవుతున్న నేపథ్యంలో వర్షాలు పడడంతో వరి చేలు తడిచిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు దిగులు చెందుతున్నారు. వర్షప్రభావంతో కొందరు రైతులు వరి కోతలను వాయిదా వేసుకోగా, మరికొందరు ఇప్పటికే పొలాల్లో కోసి ఉంచిన వరిచేలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. పలు మండలాల్లో కురిసిన వర్షానికి కోసి ఉంచిన వరిపనలలో నీరు చేరడంతో ఆందోళన చెందుతున్నారు.

జిల్లాకు తుపాను హెచ్చరికలు లేకపోవడంతో భోగాపురం మండలంలో రైతులు వరి చేలను కోతలు కోసి పొలాల్లోనే ఉంచారు. ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షంతో కోసి ఉంచిన వరిచేలు తడిచి ముద్దయ్యాయి. పంట చేతుకొచ్చే సమయానికి ప్రతి ఏడాది ఇలాగే నష్టపోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. వర్షం కారణంగా నష్టపోయిన పంటలను అధికారుల ద్వారా అంచనా వేయించి ఆదుకోవాలని కోరుతున్నారు.

వంగరలో వర్షం.. రైతుల్లో కలవరం

పూసపాటిరేగలో ధాన్యం బస్తాలపై టార్పిలిన్లు కప్పిన రైతులు

తుపాను ప్రభావంతో వంగర మండలంలోని పలు గ్రామాలలో తేలికపాటి వర్షపు జల్లులు కురిసాయి. దీంతో రైతులు కలవర పడుతున్నారు. వివిధ గ్రామాలలో కోత దశకు చేరుకున్న వరి పంటను కోసి కుప్పలుగా వేశారు. మరి కొంతమంది రైతులు వరి పంట కోసి తమ తమ పొలాలలో ఓవులుగా వేసి ఉంచారు. చాలామంది రైతులు వరి పంట కోసిన తర్వాత మొక్కజొన్న విత్తనాలు వేశారు. వర్షాలు నేపథ్యంలో వరి పంటను కాపాడు కునేందుకు వరి కుప్పలపై టార్పాలిన్లుకప్పుతున్నారు. వర్షం ఎక్కువైతే చేతుకు అందుకొచ్చే పొలాలలో ఓవులుగా ఉన్న వరిసెలు తో పాటు ఇప్పటికే పొలాలలో నాటిన మొక్కజొన్న విత్తనాలు పాడైపోతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

వర్షాలు నేపథ్యంలో వరిచేలను కాపాడుకునేందుకు పూసపాటిరేగ మండలంలో రైతులు పాట్లు పడుతున్నారు.ఇప్పటికీ వరిచేలను మట్టించి పొలాల్లో ఉన్న వరి బస్తాలను టార్పాలిన్లతో కప్పుతున్నారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో పొలాల్లోనే ధాన్యం నిల్వలను రైతులు ఉంచారు. వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సముద్రం అల్లకల్లోలం

ముక్కాం సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసిపడు తున్నాయి. కెరటాలు ఉధృతంగా రావడంతో సముద్రతీరం కోతకు గురైంది. వరుస తుపానుల కారణంగా సముద్రంలో వేట సాగకా జీవన భృతి కోల్పోయి మత్స్యకారులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. సముద్రంలో అల్లకల్లోలంగా ఉండడంతో మత్స్యకారులు గత రెండు రోజుల నుంచి వేటకు వెళ్లకుండా ఇంటికే పరిమితమయ్యారు.

పండగ వాతావరణంలో మెగా పిటిఎం నిర్వహణ

సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు, లక్షన్నర మంది పేరెంట్స్ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

ఈనెల 5న జరగబోయే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పేరెంట్స్ ,టీచర్స్ మీటింగ్) పండగ వాతావరణంలో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఈసారి సమావేశాలు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో పాల్గొనే విధంగా ప్రత్యేక ఆహ్వానాలు, ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం ఉదయం 9.00 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటలకు ముగిసేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. తల్లిదండ్రులతో అకాడమిక్ చర్చలు పారదర్శకంగా, ప్రయోజనకరంగా నిర్వహిస్తామన్నారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ యాజమాన్యాల కింద 1771పాఠశాలలు, 67 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పనిచేస్తున్నాయని తెలిపారు. సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు, లక్షన్నర మంది పేరెంట్స్, మరో 50 వేల మంది అతిథులు పాల్గొంటారని కలెక్టర్ వివరించారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ నివేదికలు, హెల్త్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డిఇఒ యు. మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ ఎ. రామారావు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో 201 వినతులు

కంటోన్మెంట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కు వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌తోపాటుపలువురు అధికారులు 201 వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 73 వినతులు, డిఆర్‌డిఎకు సంబంధించి 32 వినతులు, స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతే ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళీ, డి.వెంకటేశ్వర రావు, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి.శాంతి, కళావతి, సర్వే శాఖ ఎడి ఆర్.విజయకుమార్, ఎఒ దేవిప్రసాద్, సిపిఒ బాలాజీ, డిఇఒ మాణిక్యంనాయుడు, వ్యవసాయ శాఖ జెడి, సాంఘిక సంక్షేమశాఖ డిడి అన్నపూర్ణమ్మ, బి.సి.సంక్షేమ అధికారి జ్యోతిశ్రీ, ఆర్.డబ్ల్యుఎస్, ఆర్‌అండ్‌బి ఎస్ఇలు, మార్క్‌ఫెడ్ మేనేజరు వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పిడి విమలరాణి, డిఆర్‌డిఎ పిడి శ్రీనివాస్ పాణి, మైక్రోఇరిగేషన్ పి.డి.

పిజిఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. బలహీన వర్గాలకు కేటాయించిన కాలనీ ఇళ్లను పూర్తి చేసి ఇవ్వాలని ఎస్‌సి ,ఎస్‌టి, బిసి,మైనారిటీ కులాల ఐక్య వేదిక నాయకులు అధికారులకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఇప్పిలి రామారావు, దిమిలి పైడిరాజు, గండ్రేటి శ్రీను, అలజంగి భాను ప్రసాద్ టీవీ దుర్గారావు, లాయర్ కరీం, పి షణ్ముఖరావు, చెలికి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో భూమిని కాజేశారు

భోగాపురం మండలం గూడెపు వలస రెవెన్యూ పరిధిలో జిరాయితీ మెట్టు భూముల్లో మా తాత తల్లిదండ్రుల నుండి వారసత్వంగా సంక్రమించిన సుమారు 51 సెంట్ల భూమిని ఇద్దరు వ్యక్తుల పేరున రిజిస్ట్రేషన్ చేశారని బాధితులు శిరుగుడి అమరావతి, శిరిగుడి ప్రసాదరావు, ఎస్ శ్రీనివాసరావు, శిరిగుడి మోహన్ రావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శృంగవరపుకోట రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 381-3 లో 0.6273 సెంట్లు (సుమారు 63 సెంట్లు) భూమిని గ్యాస్ ఏజెన్సీకి ఇవ్వగా వేరే వ్యక్తులకు సేలేకమ్ డీడికి రాశారని, మా భూమి మాకు అప్పగించాలని బాధితురాలు మామిడి అచ్యుతాంబ ఫిర్యాదు చేశారు.

వికలాంగుల చట్టం 2016 పుస్తకాన్ని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సి ఆర్ ఎం ఒ విభిన్న ప్రతిభావంతుల శాఖ సంక్షేమ అధికారి ఎన్.ఈశ్వరరావు, జిల్లా విజువల్లీ చాలెంజ్‌డ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.ఉమ మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో కలెక్టర్ పింఛన్ల పంపిణీ

విజయనగరం మండలం ద్వారపూడిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

ఈనెల 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. సోమవారం జిల్లా కోర్టు పరిధిలో ఉన్న న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూరాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద భీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలను రాజీ మార్గంలో శాశ్వత పరిష్కారం చేయాలని వివరించారు. సమావేశంలో న్యాయమూర్తులు ఎం.మీనాదేవి, కె.విజయ కళ్యాణి, బి.అప్పలస్వామి, ఎమ్ పద్మావతి, కె.నాగమణి శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య, జిల్లాన్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - గజపతినగరం

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు చెల్లించాలని, హెల్త్ అలవెన్స్ కింద రూ.4వేలు ఇవ్వాలన్న జీవోని అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక ఎంపిడిఒ ఆఫీస్ వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేసి ఎంపిడిఒ బి.కళ్యాణికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ మండలంలో జిన్నాం, బంగారం పేట, కాలంరా జుపేట, రామన్నపేట గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకి నెలలు తరబడి జీతాలు బకాయి ఉంటే వాళ్ల కుటుంబాన్ని ఏ విధంగా పోషించుకుంటారని ప్రశ్నించారు. ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లకు హెల్త్ అలెవెన్స్ కింద రూ.4వేలు ఇవ్వాలని జూన్ 20వ తేదీన ఒక సర్క్యులర్ జారీ చేసిందని దాని ప్రకారం జనవరి నుంచి ప్రతి గ్రీన్ అంబాసిడర్‌కి రూ.10వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.రాము, కె.అప్పారావు, దినకరు, అప్పల స్వామి, సన్యాసి, ఆదినారాయణ, సీతయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య విధానాన్ని గమనించారు. అన్న క్యాంటీన్ పరిశీలించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ విధానాన్ని పరిశీలించారు. త్వరితగతిన పింఛన్లు అందజేయాలని కార్యదర్శులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పారిశుధ్య పనితీరును గమనించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. దోమలు నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్‌లను చేపట్టాలన్నారు.

పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్నకమిషనర్

ఉద్యాన పంటలవైపు దృష్టిసారించాలి : మంత్రి

పెదమానాపురంలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-దత్తిరాజేరు

పింఛన్లను రూ.4వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదేనని రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఆయన సోమవారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి పింఛను మొత్తాన్ని అందజేశారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ, పేదల సమస్యలను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామాజిక పింఛన్లను రూ.వెయ్యి నుంచి రూ.2వేలకు, ఆ తరువాత రూ.3వేల నుంచి ఒకేసారి రూ.4వేలకు పెంచి వారిని ఆదుకున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్‌ను రూ.2వేలు నుంచి రూ.3వేలకు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని అన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగుతోందని చెప్పారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఉద్యోగాలను కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి నడవాలని కోరారు. ఎంత ధాన్యం పండించినా కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే వరి పంట వల్ల పెద్దగా గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. అందువల్ల ఉద్యానపంటలవైపు దృష్టి సారించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి, ప్రత్యేకాధికారి టి.విమలారాణి, ఎంపిడిఒ రవికిషోర్, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రానున్న కంపెనీల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశం

గజపతినగరం : రానున్నకాలంలో స్థానికంగా వచ్చే పరిశ్రమల్లో టెక్నికల్ కోర్సులు పూర్తిచేసుకున్న యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఐటిఐ విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఐటిఐ టెక్నికల్ కోర్స్ పూర్తిచేసిన విద్యార్థులకు సరైన సూచనలు చేసేవారులేక నిరుద్యోగులుగా ఉండిపోతున్నారని అన్నారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా టెక్నికల్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బ్లూ కలర్ ద్వారా వృత్తి శిక్షణ పొంది ఉండాలన్నారు. భవిష్యత్తులో స్థానికంగా కంపెనీలు వస్తున్నాయని, వాటిలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రస్తుతం తక్కువ జీతాలతో ఉద్యోగంలో చేరితే, ఉపాధితో పాటు అనుభవం కూడా భవిష్యత్తులో పెరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ విధానాలపై అవగాహన కలిగి స్వచ్ఛందంగా కంపెనీలకు వెళ్లడానికి ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పివివి గోపాల రాజు, మండల పార్టీ అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, పిఎసిఎస్ చైర్మన్ బంగారు నాయుడు, టిడిపి సీనియర్ ప్రదీప్ కుమార్, లెంక చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా హెచ్‌ఐవి కేసులు నమోదు కాకూడదు

వ్యాధిగ్రస్తులతో కలెక్టర్ సహపంక్తి భోజనం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఇకపై జిల్లాలో కొత్తగా హెచ్‌ఐవి కేసులు నమోదు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు ఎస్. రామసుందర్ రెడ్డి అధికారులను కోరారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లాలో హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద అవగాహనా ర్యాలీని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. స్థానిక ఐఎంఎ భవనం వరకు ఈ ర్యాలీ జరిగింది. అనంతరం అక్కడ అవగాహన సదస్సు నిర్వహించారు. బాధితులతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. వ్యాధిగ్రస్తులతో కలసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొత్త కేసులు నమోదు కాకుండా ప్రతి ఒక్కరూ తమ హెచ్‌ఐవి స్థితిని తెలుసుకొని జాగ్రత్త పడాలని సూచించారు. అంతకుముందు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎ.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, బాధితులకు న్యాయపరంగా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా లీగల్ సెల్ ద్వారా వెంటనే న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం వివిధ అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి కలెక్టరు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను, బహుమతులను, జ్ఞాపికలను అందజేశారు. ఎబిసిడి, ఎన్‌జిఒ సహకారంతో హెచ్‌ఐవి రోగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్‌ఎస్‌ఎ సెక్రటరీ ఎ.కృష్ణప్రసాద్, డిఎంహెచ్‌ఒ ఎస్.జీవనరాణి, జిల్లా జైళ్లశాఖ అధికారి జి.మధుబాబు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణాధికారిణి డాక్టర్ కె. రాణి, నట్విజ్ సిఇఒ వి.విశ్వేశ్వర్రావు, రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్, వైద్యాధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులతో కలసి భోజనం చేస్తున్నకలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ దినోత్సవ వేడుకలు

విజయనగరం టౌన్ :మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాచార్యులు డాక్టర్ జి. జనార్ధన్ నాయుడు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల నుండి మెయిన్ రోడ్డువరకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ షాపులకు 5న వేలం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థకు సంబంధించిన న్యూ ఐడిఎస్‌ఎంటి గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, ఓల్డ్ ఐడి ఎస్‌ఎంటిలో ఖాళీగా ఉన్న గ్రౌండ్ ఫ్లోర్ షాపులు, ఖాళీగా ఉన్న షోరూములు, జనతా బజారు షాపులకు ఈనెల 5న వేలం పాట నిర్వహించనున్నట్లు కమిషనర్ నల్లనయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా గీతా జయంతి

విజయనగరం టౌన్ : మహారాజా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గీతా జయంతి వేడుకలు అత్యంత ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాచార్యులు సభాధ్యక్షులు, డాక్టర్ జి. జనార్దన్ నాయుడు గీతా సారాంశం వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రహ్మ రాళ్లపల్లి రామ సుబ్బారావు కర్మ జ్ఞాన మార్గాల ద్వారా మోక్షాన్ని చేరుకోవడమే గీతా సారాంశం అని తెలిపారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వి. కన్నం నాయుడు, సంస్కృత ఉపన్యాసకులు టి.రమణ మాట్లాడారు.

ధర్నా చేస్తున్న ఎండిఎం కార్మికులు

మధ్యాహ్న భోజన పథకానికి

ఉచిత గ్యాస్ సరఫరా చేయాలి

కలెక్టరేట్ వద్ద ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఉచిత గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న స్కూలు ఆయాలు 300 మంది పిల్లలకు ఒకరు పనిచేయాలని చెప్తున్నారని, కొన్ని స్కూల్స్‌లో పిల్లలు తగ్గారనే కారణంతో ఇద్దరు ఉన్న దగ్గర ఒకరిని తొలగిస్తున్నారని, దీని వలన పని భారం పెరిగి పని చేయడం కష్టంగా ఉందని అన్నారు. పని చేస్తున్న వారందరినీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్కూల్ ఆయాల జీతాలు 10వేలకు పెంచాలని, ప్రతినెల 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులుగా గుర్తించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. శానిటేషన్ పరికరాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ కార్మికుల అందరిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అర్జునమ్మ, దేవి,రమణమ్మ, సత్యవతి పాల్గొన్నారు

ఎయిర్‌పోర్టుకు వేగంగా మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-విజయనగరం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మౌలిక వసతులను కల్పించే పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. విమానాశ్రయానికి రోడ్లు, కాలువలు, విద్యుత్ తదితర వసతుల కల్పన, భూ సేకరణ తదితర అంశాలపై తమ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఎయిర్‌పోర్టుకు నీటిని అందించేందుకు సుమారు రూ.20కోట్లతో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఈ పథకానికి ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా కోసం సుమారు రూ.85లక్షలతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ లైన్‌ను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమారు 15 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్‌ను వేయాల్సి ఉందన్నారు. వర్షపునీరు వెళ్లేందుకు వీలుగా దాదాపు రూ.27 కోట్ల ఖర్చుతో సుమారు 25 కిలోమీటర్ల మేర నాలుగు కెనాల్స్‌ను తవ్వాల్సి ఉందన్నారు. దీనికి అంచనాలను త్వరగా తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులకు చెప్పారు. అదేవిధంగా సవరవల్లి-తూడెం గ్రామాలమధ్య 2.3 కిలోమీటర్ల మేర నిర్మించాల్సిన సిసి రోడ్డు పనులను వెంటనే అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. స్టాఫ్ క్వార్టర్స్, ఇతర అవసరాల కోసం చేయాల్సిన భూసేకరణపైనా చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, ఆర్‌డిఒ డి.కీర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ కవిత, ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ లక్ష్మణరావు, మైనర్ ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుకు ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐఎంఎల్ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు బి.శంకరరావు మాట్లాడుతూ ఇళ్లులేని పేదలకు అనేకసార్లు సచివాలయాల్లో దరఖాస్తులు పెట్టినా రాకపోవడమే కాకుండా ఆన్లైన్ కావడంలేదని, సర్వర్ పనిచేయడం లేదని కుంటి సాకులు చెబుతూ నమోదుకు నిరాకరిస్తున్న పరిస్థితులపై ఫిర్యాదు చేశామన్నారు. అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.అప్పలరాజు, జి.సత్యారావు తోపాటు ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ కన్వీనర్ జర్జాపు జయ, పాల్గొన్నారు

ఎయిడ్స్ పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యులు డాక్టర్ తిరుమల దేవి అన్నారు. సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి నుంచి స్టేట్ బ్యాంకు వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలతో మెయిన్ రోడ్డు పై మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ తౌడు, వైద్యులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల అధ్యక్షులు డాక్టర్.కె. రేఖ అధ్యక్షతన, ఎన్ఎస్ఎస్ పిఒలు డి. అప్పారావు, కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనందకుమార్, నాయకులు గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఎయిడ్స్ అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హిమగాయత్రి, ఎన్ఎస్ఎస్ పిఒ మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ, బొద్దాం పిహెచ్‌సిల్లో ఎయిడ్స్ దినోత్సవాన్ని పురష్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణు, సిహెచ్ఒలు, పిఎస్‌సి సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని బూరాడ, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి డాక్టర్ వి.రీనాచౌదరి, అసిరి నాయుడు ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పై గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవి సంక్రమించకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒ రాధాకృష్ణ, సుందర్ రావ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఎన్‌టిఆర్ కూడలిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు, తదితరులు

కొత్తవలస: హెచ్ఐవి పై అవగాహనా పెంచడం, వివక్షను తొలగించడమే లక్ష్యమని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి బి.సింహాద్రి నాయుడు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, పి.హెచ్. ఎన్.జగదాంబ, హెచ్.వి.పద్మావతి, హెచ్.ఎస్. ఈశ్వరరావు, యుడిసి సురేష్, ఆప్తల్మిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, ఫార్మసీ ఆఫీసర్ ఆశ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, పీడీ చంద్రశేఖర్, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

సంతకవిటి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతకవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ భవాని, ఆరోగ్య సిబ్బంది శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని వైద్యులు ప్రమీల దేవి, కృష్ణ చైతన్యలు ప్రారంభించి ప్రజలకు ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ చర్యలు, జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గాడి బంగారుబాబు తదితరులు పాల్గొని ర్యాలీలో నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు.

నెల్లిమర్ల: బహుమతులు ప్రదానం చేస్తున్న టిడిపి నాయకులు రవిశేఖర్, ఆనంద్

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి వైద్యులు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు, మండల న్యాయ సేవల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆసుపత్రి వద్ద ఎయిడ్స్ నిర్మూలన కొరకు, వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపమంటూ ప్రమాణం చేశారు. ఆసుపత్రి నుండి దేవీ కూడలి వరకు ప్లకార్డులతో ర్యాలీ చేసి, దేవీ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి, ఎయిడ్స్ నిర్మూలనకు పాటించవలసిన మెళకువలపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.నీల, ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు దొడ్డి సూర్యారావు, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ, సి.హెచ్.శ్రీకాంత్, వివేకానంద జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై వైద్యాధికారి రమ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట నాయుడు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: జాగ్రత్తలతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమని సిహెచ్‌సి సూపరింటెండెంట్ గేదెల శశిభూషణరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆసుపత్రి నుంచి ర్యాలీ చేసి ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ అంటూ వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ప్రదర్శన

ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా వారిజీవితాలకు బరోసానిస్తూ వెలుగులు నింపాలని రోటరీ, కారుణ్య సంస్థ చైర్మన్ జెసి రాజు, బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీహరి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ఎన్‌టిఆర్ కూడలిలో రోటరీ, కారుణ్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులకు సంఘీభావం తెలియచేస్తూ కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య, రోటరీ సంస్థల సభ్యులు కె శివ కాంత్, చిన్నారావు, రామకృష్ణ, నాగురు రమేష్, జిసిహెచ్‌జి శర్మ విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలస: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

వేపాడ: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

దత్తిరాజేరు: నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

చిన్నారుల నిజాయితీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

సర్వేపల్లి విద్యా నికేతన్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బొబ్బిలి హృషీకేశ్, బొబ్బిలి లాస్యశ్రీ తమకు దొరికిన పాతికవేల రూపాయల ఖరీదైన కొత్త సెల్ ఫోన్‌ను తండ్రి న్యాయవాది రామకృష్ణతో కలిసి ఆదివారం రాత్రి పదిన్నర సమయంలో కానిస్టేబుల్ పాపారావుకు స్టేషన్‌లో అందజేశారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న శీశెట్టి సామ్రాట్‌ను స్టేషన్‌కు పిలిపించి చిన్నారుల చేతులు మీదుగా సోమవారం ఆ సెల్‌ఫోన్‌ను అందించారు. చిన్నారుల నిజాయితీని, సామాజిక బాధ్యతను సిఐ వి.నారాయణమూర్తి, ఎస్ఐ యన్.సత్యనారాయణ, అభినందించారు.

పిహెచ్‌సిని తనిఖీ చేయండి

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో గర్భిణులకు వైద్య సేవలందించే గదితో పాటు రక్త పరీక్షలు నిర్వహించే గది, ప్రసూతి గదిలో కనీస సౌకర్యాలు లేవని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావుల సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ వెంటనే డిఎంహెచ్ఒని క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుని సమక్షంలో దర్యాప్తు చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

చలి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వేపాడ

చలి కాలంలో పశువుల పట్ల పాడి రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ గాయత్రి అన్నారు. ఆమె సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ పశువులకు ఏర్పాటు చేసిన షెడ్లను గాలి, వెలుతురు తగిలే విధంగానూ, చలిగాలి తగలకుండా చూసుకోవాలని చెప్పారు. పశువులకు ఎక్కువ శక్తిని ఇచ్చే పోషకాహారం అందజేయాలని, నేలపై ఎండుగడ్డి, టార్పాన్లను ఏర్పాటు చేయాలని అన్నారు. నీటి సదుపాయం, పరిశుభ్రత, ఆరోగ్య పర్యవేక్షణ, వ్యాక్సినేషన్ చలికాలంలో వచ్చే వ్యాధులు నివారణకు అవసరమైన టీకాలు, వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు.

జిఎస్‌డబ్ల్యుఎస్‌గా బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- డెంకాడ

ఉత్తర్వుల కాపీను అందుకుంటున్న కర్రోతు

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న కర్రోతు రాజ్‌కుమార్ మండల జిఎస్‌డబ్ల్యుఎస్ (డిప్యూటీ ఎంపిడిఒ) అధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వై.భవానీకి ఉత్తర్వుల కాపీను రాజ్‌కుమార్ అందించారు. డెంకాడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పిఎల్‌విఎస్ తులసీ నాగమణి జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారిగా ప్రమోషన్‌పై రామభద్రపురం బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎఒ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్‌కు ఎంపిక

డెంకాడ: మండలంలోని అక్కివరం మోడల్ స్కూల్ సీనియర్ ఇంటర్ విద్యార్థి పి.దుర్గాభవానీ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా దుర్గాభవానీని పీడీ ఎన్ వరహాలు, ఉపాధ్యాయులు అభినందించారు.

పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వేపాడ, లక్కవరపుకోట, కొత్తవలస, ఎస్.కోట మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు నిర్వహించినట్లు కృషి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సిహెచ్ చిరంజీవి రావు, బిపిఎ రాజు తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలనే ఆలోచనతో ఈ పరీక్ష నిర్వహించామన్నారు. ఈ పరీక్షల్లో 14 పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొనగా సోంపురం, కల్లేపల్లి రేగ, గంగుపూడి, గొలజాం, ఎల్ కోట, వెంకటరమణ పేట, కొత్తవలస, వియ్యంపేట విద్యార్థులు మొదటి ఎనిమిది స్థానాలు సాధించారు. మౌలిక క్విజ్ పరీక్షల్లో గంగుపూడి, సోంపురం, కల్లేపల్లి రేగ పాఠశాల విద్యార్థులు మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకుని వరుసుగా రూ.4500, రూ.3వేలు, రూ.1500 నగదు బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో కృషి ఫౌండేషన్ ప్రతినిధులు చీమలపాటి శర్మ, ఉపాధ్యాయులు, దాతలు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే కళా వెంకటరావు

ప్రజాశక్తి - చీపురుపల్లి

దిత్వా తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. దిత్వా తుపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చేతికి అంది వచ్చిన వరి పంట నాశనం కాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇప్పటికే కోయడానికి సిద్ధంగా ఉన్న వరిని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు కోయకుండా ఉండటం శ్రేయస్కరం అని అన్నారు. ఇప్పటికే కోసి, పొలాల్లో ఉన్న వరి పనలను వెంటనే గట్లపైకి చేర్చుకోవాలన్నారు. నూర్పిడి చేసిన ధాన్యం రాశులపై వెంటనే టార్పాలిన్లు (పరదాలు) కప్పి భద్రపరచి కల్లాల వద్ద నీరు నిలవకుండా కాలువలు తీసి నీటిని మళ్లించాలన్నారు. పొలాల్లో నీరు నిలిచి ఉంటే, వరి కుప్పలు నీట మునిగి నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున వెంటనే బోదెలు, కాలువలు తవ్వి నీటిని బయటకు మళ్ళించాలన్నారు. పశువులను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే అధికారులకు సహకరించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

కోటి సంతకాలతో కూటమి కళ్లు తెరిపించాలి

ప్రజాశక్తి- చీపురుపల్లి

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయానికి ప్రజల నుండి సేకరిస్తున్న కోటి సంతకాలతో కళ్లుతెరిపించాలని వైసిపి నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష సారాజ్యంలో పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాల, శ్రీనివాస కళాశాలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్షం చేపట్టిన 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమం మండలంలో పెద్దఎత్తున కొనసాగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం అధ్యక్షులు బెల్లాన వంశీ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి శ్రీనివాస్, నాయకులు దన్నాన జనార్దన్, బెల్లాన త్రినాధరావు, పతివాడ రాజారావు, యమ్ ఎస్ ఎన్ రాజు మాస్టర్, ఇప్పిలి గోవింద్, పాండ్రంకి వాసు, కోసిరెడ్డి రమణ పాల్గొన్నారు.

మెరకముడిదాం: మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో వైసిపి ఆధ్వర్యంలో జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ మంత్రి కుమార్తె బొత్స అనూష పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళశాలలను ప్రయివేటీ పరం కాకుండా కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోట్ల వెంకటరావు, తాడ్డి వేణుగోపాలరావు, ఎస్‌వి రమణరాజు, ఊటపల్లి సర్పంచ్ సంగంరెడ్డి లక్ష్మి, చందక చిరంజీవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న బొత్స అనూష

మామిడి పంటపై శిక్షణ

ప్రజాశక్తి- గంట్యాడ

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

మండలంలోని గొటియాడ గ్రామంలో సోమవారం రైతులకు మామిడి పంట పై ఉద్యాన శాఖ అధికారి పి.స్వాతి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె శాస్త్రవేత్త శ్రీనివాసరాజు రైతులకు మామిడి పంట సమగ్ర యాజమాన్య పద్ధతులు, పూత ముందు, పూత అనంతరం, పిందె సమయంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, పిందె దశలో పండ్ల కవర్లు కట్టటం ప్రాముఖ్యతను గురించి వివరించారు. రైతులు తమ సందేహాలను, మామిడి పంటలో వేసుకోగలిగే అధిక ఆదాయం వచ్చే అంతర పంటలు గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్, గ్రామ ఉద్యాన సహాయకులు పి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారిగా రవి

ప్రజాశక్తి- దత్తరాజేరు

మండలంలోని గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారిగా బి.రవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పూసపాటిరేగ మండలంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తూ ప్రమోషన్‌పై దత్తరాజేరు మండలానికి ప్రత్యేక అధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 10 గంటలకు సచివాలయానికి వచ్చి పేస్ యాప్ మూమెంట్ బుక్‌లో సంతకం చేసి ఫీల్డ్‌కి వెళ్ళాలన్నారు. మళ్ళీ సాయంత్రం ఐదు గంటలకు సంతకం పెట్టాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని ఆకులసీతంపేట గ్రామానికి చెందిన ఆర్యవైశ్య కుటుంబానికి చెందిన కొంచెం అమ్మాజీ ఇటీవల మృతి చెందారు. దీంతో వేపాడ వాసవి క్లబ్ సభ్యులు ముందుకు వచ్చి, ఆ కుటుంబానికి రూ.7వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు. అదే గ్రామానికి చెందిన కొత్త గుప్తా ఒక రైస్ బ్యాగ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు దుడ్డి శ్రీనివాసరావు, కొంచెం శ్రీరామ్మూర్తి, కొత్త గుప్తా, శ్రీనాథ్, నాగరాజ, మాదేటి శ్రీను, వి.సంపత్ కుమార్ పాల్గొన్నారు.

పోలీసు పిజిఆర్ఎస్‌కు 24 ఫిర్యాదులు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

బాధితులతో మాట్లాడుతున్న ఎస్‌పి

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆధ్వర్యాన నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు సోమవారం 24 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల సమస్యలను విన్న ఎస్‌పి వాటిని పరిష్కరించేందుకు ఆయా మండలాల పోలీసు అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 9, కుటుంబ కలహాలకు సంబంధించినవి 4, నగదు వ్యవహారాలకు సంబంధించి 2, మోసాలకు సంబంధించి 2, ఇతర అంశాలకు సంబంధించినవి 7 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిసిఆర్‌బి సిఐ కే.కుమార స్వామి, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, అంబేద్కర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

ప్రజాశక్తి- రేగిడి

తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఇఒ వరప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం ఆయన కొండవలస ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు సృజనాత్మకత విద్యను అందించాలని సూచించారు. అనంతరం పిల్లల అభ్యాసన సామర్థ్యాలు ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్కు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్స్, ఎస్ఎ వన్ మార్క్స్ ఎంట్రీ తదితర అంశాలను పరిశీలించారు. హెచ్ఎం ఎస్.నాగభూషణ్‌రావుకు పాఠశాల మరుగుదొడ్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు సిహెచ్ వైకుంఠరావు ఉన్నారు.

కరాటేలో మోహన్ ప్రకాశ్ ప్రతిభ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని వియ్యంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అసిరాడ మోహన్ ప్రకాష్ రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2.0లో 50 కేజీల విభాగంలో మొదటి స్థానం సాధించాడని కోచ్ కె.రాజాబాబు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరాజు మాట్లాడుతూ మోహన్ మరెన్నో విజయాలు సాధించాలని అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్ర శేఖర్, ఎల్‌జిఎన్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

విద్యలో మాజీ సైనికులు పిల్లలకు మూడు శాతం రిజర్వేషన్ కల్పించాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు రేవళ్ల కిరణకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పాత కోటలో ఉన్న మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో సోమ వారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొత్తగా రిటైర్డ్ అయిన వారికి భూముల కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇచ్చే సమయంలో మాజీ సైనికుల కోటా కింద రెండు శాతం జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఎడ్యుకేషన్ సీట్ల రిజర్వేషన్లలో ఇప్పుడున్న రెండు శాతానికి మరొక శాతం కోటా పెంచి మాజీ సైనికుల పిల్లలకు ఉన్నత విద్య అందించాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన మాజీ సైనికుడు బి.ఈశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మరడరామినాయుడు, ఉపాధ్యక్షులు రెడ్డి రామకృష్ణ, కార్యదర్శి ఏ గోవిందనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ ఆర్ మోహనరావు, ట్రెజరర్ వి ఎన్ శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

సైన్స్, బ్యూటీ అఫ్ ఇండియన్ మ్యూజిక్‌పై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ అండ్ బ్యూటీ అఫ్ ఇండియన్ మ్యూజిక్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ రేఖ కందుల అధ్యక్షతన, సైన్స్, బ్యూటీ ఆఫ్ ఇండియన్ మ్యూజిక్ అంశంపై డాక్టర్ ఎం ఆర్ కె ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్ఇపి 2020 ప్రకారం మల్టీ డిస్పినరి అంశాల మీద విద్యార్థులకు అవగాహన కల్పించడానికి, సైన్సు, మ్యూజిక్ సంబంధించి కార్యక్రమం చేపడుతున్నామని, ఇది విద్యార్థులకు, ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. సంగీతంలో మెలకువలు, సైన్స్ సంబంధిత అంశాలను మ్యూజిక్‌తో సమన్వయ పరచడం, సంగీతంలో మనకు తెలియకుండానే దాగివున్న శాస్త్రీయ రహస్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ జయపాలరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి. అప్పారావు, డాక్టర్ ఎమ్. రమాగీతాదేవి, డి.మాధురి, రాఘవ, సుశీల పాల్గొన్నారు.

అక్రమ కబేళాలు మూసివేయాలి

విజయనగరం టౌన్ : కంటోన్మెంట్ లో అక్రమంగా నడుస్తున్న ఆవు మాంసం కబేళాలు, దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ మసీదు ఎదురుగా ఎ1 బిరియాని సెంటర్ వెనుక బ్లూ గేట్, దాని చుట్టు పక్కల యథేచ్ఛగా ప్రతి రోజు ఆవులను దూడలను చంపి రాష్ట్రంలో కంపెనీలకు పంపిస్తున్నారని తెలిపారు. పది రోజులలో కబేళాలు ఆవు మాంసం దుకాణాలు మూసివేయకుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కెవిఆర్ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి భీమపల్లి సంధ్యారాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పాడ పైడితల్లి, సారిక రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల ఆధ్వర్యాన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని నెమలాం, కవిరాయునివలస గ్రామాలలో ఎమ్మెల్యే బేబినాయన సోమవారం టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాంబాబు, తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎఎంసి చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, మర్రాపు యుగంధర్, మర్రాపు శంకర్రావు, రెడ్డి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని కావలిలో మాజీ స్పీకర్ ప్రతిభ భారతి, ఎమ్మెల్సీ గ్రీష్మ ప్రసాద్ పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేంద్ర కుమార్, టిడిపి నాయకులు టి.అమర్, టి.ఉదయ్, అన్నెపు చిరంజీవి, టి.వాసు, టి.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: పింఛను సొమ్మును అందిస్తున్న ఎమ్మెల్సీ గ్రీష్మ

తెర్లాం: వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన


విజయనగరం: వికలాంగునికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం కోట : నగరంలోని 25వ డివిజన్ సున్నపు బట్టి వీధిలో పింఛన్లను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కొత్తగా మంజూరైన 54 ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కూడా అందజేశామన్నారు. మొత్తం 28,598 మందికి పింఛన్లు అందజేస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌కోట: వృద్ధురాలికి పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట: పట్టణ కేంద్రంలోని బర్మా కాలనీలో టిడిపి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్నూరు సాయిరాం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు దోకుల అచ్చెంనాయుడు, పిఏసిఎస్ చైర్మన్ జిఎస్ నాయుడు, నాయకులు నానిగిరి రామనాజీ, కాపుగంటి వాసు, అరుణ, ఇందుకూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్., విజయనగరం
భోగాపురం బ్రాంచి
DCCB-VZM
(రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం కలిగిన మరియు రిజర్వు బ్యాంకు లైసెన్స్ పొందిన బ్యాంకు)

ప్రకటన

ది జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్., విజయనగరం (H.O), భోగాపురం బ్రాంచి పరిధిలోని ది పోలిపల్లి ఫార్మర్స్ సర్వీస్ కోపరేటీవ్ సొసైటి లిమిటెడ్ (FSCS), పోలిపల్లి యందు బంగారు ఆభరణముల నాణ్యత, బరువు పరిశీలించి బ్యాంకు నిబంధనలకు లోబడి బంగారు ఆభరణముల తనఖాపై ఋణములు మంజూరుకు సిఫారుసు చేయుటకు అనుభవం కల్గిన అప్రైజర్ కావలెను. అర్హత కలిగిన వారు ప్రకటన తేది నుండి 5 రోజులలోగా తమ దరఖాస్తులను DCCB - భోగాపురం బ్రాంచి కార్యాలయంనకు పంపించవలెను. అర్హత మరియు యితర నిబంధనలు కొరకు బ్యాంకు యొక్క వెబ్‌సైట్ నందు చూడవలెను. https://www.dccbviziangaram.com, Ph : 8712698912 & 9642365170

బ్రాంచి మేనేజర్
ది జిల్లా సహకార కేంద్రబ్యాంకు లి॥, విజయనగరం
భోగాపురం బ్రాంచి, సవరవిల్లి

స్థలం : సవరవిల్లి
తేది : 01-12-2025